సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

97053 47483

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

ఎంపీ సహపంక్తి భోజనం



బీఎస్ఆర్ నగర్‌లో కార్యకర్తలతో కలిసి భోజనం చేస్తున్న ఎంపీ ఎంవీవీ

ఆరిలోవ: జీవీఎంసీ 10వ వార్డు తోటగరువు, బీఎస్ఆర్ నగర్‌లలో విశాఖ ఎంపీ, వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ శుక్రవారం పర్యటించారు. ఆయన గడపగడపకు వెళ్లి స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం బీఎస్ఆర్ నగర్‌లో బద్రికోన వరలక్ష్మి ఇంట్లో ఆమె కుటుంబ సభ్యులు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలతో కలిసి ఎంపీ సహపంక్తి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో విద్యా విభాగం డైరెక్టర్ పతివాడ వెంకటలక్ష్మి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఎన్నికల విధులకు సిద్ధం కండి



పరేడ్‌లో గౌరవ వందనం స్వీకరిస్తున్న అనకాపల్లి ఎస్పీ మురళీకృష్ణ

ఆరిలోవ: ఆర్మ్‌డ్ రిజర్వ్‌డ్ పోలీసులు ఎన్నికలకు సిద్ధం కావాలని అనకాపల్లి ఎస్పీ కె.వి.మురళీకృష్ణ తెలిపారు. విశాలాక్షినగర్‌లోని కైలాసగిరి ఏఆర్ పోలీస్ మైదానంలో శుక్రవారం పోలీసులు నిర్వహించిన పరేడ్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఏఆర్ అధికారులు, సిబ్బందితో మాట్లాడి, వారి సమస్యలపై ఆరా తీశారు. ప్రశాంత వాతావరణంలో.. ఎన్నికల నియమావళిని అనుసరించి పటిష్టంగా బందోబస్తు విధులు నిర్వర్తించాలని సూచించారు. సిబ్బందికి ఎలాంటి సమస్యలు వచ్చినా తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో పోలీస్ సిబ్బందికి కో–ఆపరేటివ్ సొసైటీ ద్వారా రుణ సౌకర్యం లభిస్తుందన్నారు. అత్యవసర సమయాల్లో విద్య, వైద్యం, గృహ నిర్మాణం, వివాహాది అవసరాల కోసం కో ఆపరేటివ్ సొసైటీ ద్వారా రూ.4లక్షల నుంచి రూ.5 లక్షల వరకు రుణం తీసుకోవచ్చన్నారు. హోంగార్డుల సంక్షేమం కోసం త్వరలో కోఆపరేటివ్ సొసైటీ ఏర్పాటు చేయడానికి కృషి చేస్తామన్నారు. ఏఆర్ డీఎస్పీ పి.నాగేశ్వరరావు, అదనపు ఎస్పీ విజయభాస్కర్, ఏఆర్ ఐలు సతీష్, మన్మధరావు, సంజీవిరావు, నరసింహమూర్తి, అరవింద్ కిశోర్ పాల్గొన్నారు.

సచివాలయ భవనం ప్రారంభం

బీచ్ రోడ్డు: ఊటగడ్డ సచివాలయం భవనాన్ని జీవీఎంసీ 28వ వార్డు కార్పొరేటర్ పల్లా అప్పలకొండ ప్రారంభించారు. సచివాలయానికి వచ్చే ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా విశాలమైన గదులతో అన్ని మౌలిక వసతులతో సచివాలయాన్ని నిర్మించినట్టు కార్పొరేటర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి పల్లా దుర్గారావు, సచివాలయం సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు వాసవీ క్లబ్ విరాళం



విద్యార్థులకు అందించే సామగ్రితో వాసవీ క్లబ్ సభ్యులు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆంగ్ల మాధ్యమం పాఠశాల విద్యార్థులకు పరీక్షలకు ఉపయుక్తంగా నిలిచే పెన్నులు, అట్టలను వాసవీ క్లబ్ విశాఖపట్నం సభ్యులు అందజేశారు. పదో తరగతి పరీక్షలకు హాజరవుతున్న 80 మంది విద్యార్థులకు వీటిని అందజేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ పూర్వ అధ్యక్షుడు పి.సాంబమూర్తి, క్లబ్ అధ్యక్షుడు కంకటాల సతీష్, ఎం.విజయ్ కుమార్, ప్రాంతీయ కార్యదర్శి కె.ఎస్.రామారావు, పి.శేషగిరి, సురేష్ పాల్గొన్నారు.

అభివృద్ధిలో కొత్త ఒరవడి

- రూ.35.90 కోట్లతో 17వ వార్డులో అభివృద్ధి పనులు
- స్పోర్ట్స్, ఆహ్లాదం మౌలిక సదుపాయాలకు పెద్దపీట



శివాజీ పార్కులో ఫౌంటైన్



ఆధునికీకరించిన టీటీడీ కల్యాణ మండపం

ఎంవీపీ కాలనీ: జీవీఎంసీ 17వ వార్డులో మౌలిక వసతులు కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం కొత్త ఒరవడిని సృష్టించింది. వార్డు ప్రజలతో పాటు నగర వాసులకు తలమానికమైన శివాజీపార్కు, టీటీడీ కల్యాణ మండపం, స్పోర్ట్ ఎరీనాలను భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దింది. పార్కులు, రోడ్లు, ఓపెన్ జిమ్‌లు, డ్రైనేజీలు, సామాజిక భవనం, ఫుట్‌పాత్‌ల నిర్మాణంతో పాటు కూడళ్ల ఆధునికీకరణ చేపట్టింది. ఇలా మరిన్నో సౌకర్యాలు అందుబాటులోకి తెచ్చి ప్రజల్లో నూతన ఉత్సాహాన్ని నింపింది.

రూ.24 కోట్లతో స్పోర్ట్స్ ఎరీనా

బహుళ క్రీడలను ప్రోత్సాహించే లక్ష్యంతో నగరంలో స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంకు ప్రత్యామ్నాయంగా అంతర్జాతీయ క్రీడా ప్రమాణాలతో అధునాతన ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను ఎంవీపీ కాలనీలో ఏర్పాటు చేశారు. 1.5 ఎకరాల్లో ఈ ప్రాజెక్టును పట్టాలెక్కించారు. స్మార్ట్ సిటీ ప్రాజెక్ట్స్‌లో భాగంగా ఈ స్పోర్ట్స్ ఎరీనా నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. రూ.24 కోట్లకు పైగా వ్యయంతో ఈ ప్రాజెక్టు నిర్మాణం జరిగింది. ఈ ఇండోర్ స్టేడియాన్ని పూర్తి సెంట్రల్ ఏసీ సామర్థ్యంతో తీర్చిదిద్దారు. సీలింగ్, సింథటిక్ ఫ్లోరింగ్ సౌకర్యాలతో పాటు సింథటిక్ వాకింగ్ ట్రాక్, సైక్లింగ్ ట్రాక్, బాస్కెట్ బాల్ కోర్టు, షెటిల్ కోర్ట్స్, వాలీబాల్ కోర్ట్సు, చెస్ క్యాబిన్, యోగా క్యాబిన్, సువిశాలమైన స్విమ్మింగ్‌పూల్ వంటి మల్టీపర్పస్ సౌకర్యాలతో తీర్చిదిద్దారు.

రూ.4.15 కోట్లుతో ఫంక్షన్ హాల్

ఎంవీపీ కాలనీలోని సెక్టార్–1లోని వీఎంఆర్‌డీఏ కల్యాణ మండపం స్థానంలో ఈ కన్వెన్షన్ హాల్ నిర్మాణం జరుగుతోంది. రూ.4.15 కోట్ల వ్యయంతో సెల్లార్+ 2 ఫ్లోర్స్‌గా ఈ కన్వెన్షన్ హాల్‌ను నిర్మిస్తున్నారు. 1000 చదరపు గజాల విస్తీర్ణంలో చేపడుతున్న ఈ నిర్మాణంలో సెల్లార్‌ను పూర్తిగా పార్కింగ్ కోసం కేటాయించనున్నారు. పై రెండు అంతస్తుల్లో రెండు భారీ హాళ్లను నిర్మించనున్నారు. 5 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఈ హాళ్ల నిర్మాణం జరగనుంది.

రూ.2 కోట్లుతో శివాజీ పార్కు

దశాబ్దాలుగా పూర్తిస్థాయి ఆధునికీకరణకు నోచుకోని శివాజీ పార్కును జీవీఎంసీ రూ.2 కోట్లతో అభివృద్ధి చేసింది. రూ.1.5 కోట్లతో పార్కులో అభివృద్ధి, ఆధునికీకరణ పనులు చేపట్టారు. పార్కు ముఖద్వారం, ఫ్లోరింగ్, సెంటర్ ప్లాజా ఫొటో షూట్ పాయింట్ ఆధునికీకరణ, టైల్స్ నిర్మాణం, పెయింటింగ్స్, లైటింగ్ ఏర్పాటు చేశారు. జిమ్, చిల్డ్రన్ ప్లే ఏరియా, వాకింగ్ ట్రాక్‌ను మెరుగుపరిచారు. రూ.50 లక్షలతో ఫౌంటైన్ల ఆధునికీకరణ పూర్తి చేశారు. ఈ ఫౌంటైన్ల మధ్య ఉన్న ఛత్రపతి శివాజీ విగ్రహం ఆకట్టుకుంటోంది.



17వ వార్డులో నిర్మించిన స్పోర్ట్స్ ఎరీనా

రూ.48 లక్షలతో కల్యాణ మండపం

17వ వార్డులో రూ.48 లక్షలతో కల్యాణ మండపాన్ని జీవీఎంసీ నిర్మించింది. ఇప్పటికే ఈ పనులు తుది దశకు చేరుకున్నాయి. పెదవాల్తేర్ ప్రాంత ప్రజలకు కల్యాణ మండపంతో పాటు సామాజిక భవనం లేక ఇబ్బందులు పడుతున్నారు. దీంతో స్థానిక కార్పొరేటర్ చొరవతో జీవీఎంసీ రూ.48 లక్షలతో కల్యాణ మండపాన్ని సిద్ధం చేస్తోంది.

కనువిందుగా ఉషోదయ కూడలి

ఎంవీపీ కాలనీ ఉషోదయ సర్కిల్‌ను సైతం జీవీఎంసీ జోన్–3 ఇంజినీరింగ్ విభాగం ఆధునికీకరించింది. ఇప్పటికే దీనికి సంబంధించి పనులు పూర్తయ్యాయి. సర్కిల్‌ను ఆనుకుని ఫుట్‌పాత్, రోడ్డు నిర్మాణం కూడా పూర్తయింది. సర్కిల్‌లో ఐలాండ్ ఏర్పాటుతో పాటు వాటర్ ఫౌంటైన్ ఏర్పాటు చేశారు.

రూ.2.87 కోట్లు ప్రధాన రహదారులు

శివాజిపాలెం రోడ్డుతో పాటు ఉషోదయ కూడలి నుంచి టీటీడీ కల్యాణ మండపానికి వెళ్లే మార్గాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. శివాజీపార్కు రోడ్డును జీవీఎంసీ రూ.1.97 కోట్లతోను, టీటీడీకి వెళ్లే రోడ్డును రూ.90 లక్షలతో నిర్మించారు. రామలక్ష్మీ అపార్టుమెంట్ కూడలి నుంచి శివాజీపాలెం హైవే వరకు 1.5 కిలోమీటర్ల మేర ఈ రహదారిని, ఉషోదయ కూడలి నుంచి టీటీడీ సర్కిల్ వరకు కిలోమీటరు మేర రహదారిని అభివృద్ధి చేశారు.

జీవీఎంసీ స్పోర్ట్స్ ఎరీనా	రూ.24 కోట్లు
సెక్టార్-1లో మినీ కన్వెన్షన్ హాల్ నిర్మాణం	రూ.4.15 కోట్లు
శివాజీపార్కు ఆధునికీకరణ	రూ.2 కోట్లు
కల్యాణ మండపం నిర్మాణం	రూ.0.48 కోట్లు
పార్కుల్లో ఓపెన్ జిమ్‌ల అభివృద్ధి	రూ.0.20 కోట్లు
ఆదర్శనగర్‌లో రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం	రూ.0.20 కోట్లు
టీటీడీ కల్యాణ మండపం ఆధునికీకరణ	రూ.2 కోట్లు
ప్రధాన రహదారుల నిర్మాణం	రూ. 2.87 కోట్లు



ఉషోదయ-టీటీడీ కూడలి రోడ్డు

అన్ని సౌకర్యాలు అందుబాటులోకి..



17వ వార్డులో అన్ని రకాల సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయి. పెద్ద ఎత్తున రహదారుల నిర్మాణం, ఫుట్‌పాత్‌లు, కూడళ్ల అభివృద్ధి చేపట్టారు. ఉషోదయ కూడలిలో బీటీ రోడ్డు నిర్మాణంతో పాటు కూడలి ఆధునికీకరణ బాగుంది. ఆదర్శనగర్‌లో కాలువలు, రోడ్ల మరమ్మతులు చేపట్టారు. ఈ నాలుగున్నరేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో 17వ వార్డు ఎంతో అభివృద్ధి సాధించింది.

– **పీలా సత్యవతి**, ఆదర్శనగర్, 17వ వార్డు

ప్రజలకు మెరుగైన సౌకర్యాల లక్ష్యం



ప్రజల ఆధునిక అవసరాలు తీర్చే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం జీవీఎంసీ ద్వారా 17వ వార్డులో అనేక సౌకర్యాలు కల్పించింది. స్మార్ట్‌లుక్‌తో వార్డును సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దాం. బడులు, వైద్యశాలలు, పార్కులు ఇలా అన్నింటా సౌకర్యాలను మెరుగుపరిచాం. శివాజీ పార్కు, స్పోర్ట్ ఎరీనా వంటి సౌకర్యాలు వార్డుకు మరింత గుర్తింపునిచ్చాయి. రోడ్లు, ఫుట్‌పాత్‌లు, డ్రైనేజీ మరమ్మతులు చేపట్టాం.

– **గేదెల లావణ్య**, కార్పొరేటర్, 17వ వార్డు

రూ.2 కోట్లతో రెవెన్యూ పార్కు ఆధునికీకరణ



పార్కు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ

ఆరిలోవ: జీవీఎంసీ 9వ వార్డు విశాలాక్షినగర్‌లో రెవెన్యూ పార్కు అభివృద్ధికి జీవీఎంసీ రూ .2 కోట్ల నిధులు కేటాయించింది. ఈ మేరకు శుక్రవారం విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ వార్డ్ కార్పొరేటర్ స్వాతి, ది విశాలాక్షినగర్ రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో అన్ని వార్డుల్లోనూ అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. పార్కు పనులు త్వరగా పూర్తి చేయాలని జీవీఎంసీ ఇంజినీరింగ్ అధికారులను ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు సత్తి నాగేశ్వరరెడ్డి, కార్యదర్శి వి.సింహాద్రిరావు, రామాలయ కమిటీ కార్యదర్శి మధుసూదనరావు, మల్లేశ్వరరావు, లక్ష్మీ, బీమా, రాజా, కళావతి, పద్మావతి, తాతారావు, ధర్మారావు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి సాయం

ఎంవీపీ కాలనీ: అనారోగ్యంతో మృతి చెందిన కొసనపు పోతురాజు(60) కుటుంబానికి వైఎస్సార్‌సీపీ తూర్పు సమన్వయకర్త, విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ రూ.10 వేలు సాయం అందజేశారు. 19వ వార్డు శివగణేష్ నగర్‌లోని మృతుడి నివాసానికి వెళ్లి పోతురాజు భౌతికకాయం వద్ద పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అతని భార్య, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పడంతో పాటు సాయమందించారు. ఈ కార్యక్రమంలో 19వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి వెంకటలక్ష్మి, గణేష్, వసంత, తదితరులు పాల్గొన్నారు.

అనూషకు వర్సిటీ డాక్టరేట్

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం గణిత శాస్త్ర విభాగ పరిశోధకురాలు కాదంబాల అనూషకు డాక్టరేట్ లభించింది. విభాగాధిపతి ఆచార్య పి.అనూరాధ కామేశ్వరి పర్యవేక్షణలో సమ్ అప్లికేషన్స్ విత్ జనరలైజ్డ్ బ్యాలెన్సింగ్ సీక్వెన్స్ అండ్ జనరలైజ్డ్ లూకాస్ సీక్వెన్సెస్ అంశంపై జరిపిన పరిశోధనకు ఆమెకు డాక్టరేట్ వచ్చింది. ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి నుంచి డాక్టరేట్ ఉత్తర్వులను అనూష అందుకున్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం



బాలింతలు, గర్భిణులకు అవగాహన కల్పిస్తున్న కంట్రోల్ ఫుడ్ సేఫ్టీ అధికారి ఐశ్వర్య

ఆరిలోవ: పౌష్టికాహారం తీసుకుంటేనే ఆరోగ్యం లభిస్తుందని కంట్రోల్ ఫుడ్ సేఫ్టీ అధికారి ఐశ్వర్య తెలిపారు. ఈ నెల 9 నుంచి 23 వరకు పౌష్టికాహార పక్షోత్సవాలు జరగనున్నాయి. ఇందులో భాగంగా శుక్రవారం ఆరిలోవ ప్రాంతం 11వ వార్డు బాలాజీ నగర్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్(యూపీహెచ్‌సీ)లో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు సంయుక్తంగా బాలింతలు, గర్భిణులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎలాంటి ఆహారం తినాలి, పిల్లలకు ఏవిధంగా ఆహారం అందించాలి, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. యూపీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కిరణ్ లలితాకుమారి మాట్లాడుతూ పిల్లలకు, రక్తహీనతతో బాధపడుతున్నవారికి ఐరన్, ప్రోటీన్లు ఎక్కువగా ఉండే ఆహారం ఇవ్వాలన్నారు. చిరుధాన్యాలు, ఆకుకూరలు తినిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఫుడ్ సేఫ్టీ టెక్నికల్ ఆఫీసర్ దుర్గాదేవి, సీడీపీవో రమణికుమారి, సూపర్‌వైజర్ విన్నీసా, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

వర్సిటీ అభివృద్ధి ప్రశంసనీయం

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం అభివృద్ధి ప్రశంసనీయమని ఏయూ పూర్వ విద్యార్థి, శాస్త్రవేత్త డాక్టర్ కె.దుర్గా ప్రసాద్ అన్నారు. అహ్మదాబాద్‌లోని ఫిజికల్ రీసెర్చ్ లేబొరేటరీలో శాస్త్రవేత్తగా పని చేస్తున్న దుర్గా ప్రసాద్ ఏయూ భౌతికశాస్త్ర విభాగం పూర్వ విద్యార్థి. శుక్రవారం విభాగంలో విద్యార్థుల నుద్దేశించి ప్రత్యేక ప్రసంగం చేశారు. అనంతరం ఏయూ వీసీ ప్రసాదరెడ్డితో మర్యాద పూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బోధన వసతులు, మౌలిక సదుపాయాలు, పరిసరాలు, భవనాలు ఆధునికీకరించిన విధానం ఆదర్శంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఓఎస్‌డీ ఆచార్య వి.కృష్ణమోహన్, విభాగాధిపతి ఆచార్య శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

సివిల్ ఇంజినీరింగ్‌లో సదస్సు నిర్వహణ

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో నిర్మాణిక 2కే24 సివిల్ ఇంజినీరింగ్ విభాగంలో శుక్రవారం సదస్సు నిర్వహించారు. ఈ సదస్సును సివిల్ ఇంజినీరింగ్ విభాగం ఆచార్యులు కె.రాజగోపాల్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్.కె భట్టి, కన్వీనర్ జి.శిరీష తదితరులు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో బి.ప్రజ్ఞ, డాక్టర్ ఎస్.అరుణ తదితరుల పాల్గొన్నారు.

రాష్ట్ర కమిటీ ప్రతినిధికి సత్కారం



ఎర్రాజీని సత్కరిస్తున్న ఆనందరావు తదితరులు

దాబాగార్డెన్స్ : జీవీఎంసీ ఎంప్లాయిస్ యూనియన్ కార్యవర్గ సభ్యుడు బొట్టా ఎర్రాజీ వైఎస్సార్ టీయూసీ రాష్ట్ర కమిటీలో యూనియన్ కార్యదర్శిగా నియమితులైన సందర్భాన్ని పురస్కరించుకుని శుక్రవారం యూనియన్ గౌరవ అధ్యక్షుడు మహదేవ్ ఆనందరావు నేతృత్వంలో ఘనంగా సత్కరించారు. 25 ఏళ్లుగా ఉద్యోగ, కార్మికులకు చేస్తున్న సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పల్లా ఆనంద్, బంగారుకుమార్, పి. కనకరాజు, బాచి, నాయుడు, ఆర్. సత్యం, యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

విద్యా సమాచారమ్

విద్యార్థి ఉజ్వల్ గోయల్ ప్రతిభ



విద్యార్థి ఉజ్వల్ గోయల్‌ను అభినందిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచిన ఆంధ్ర విశ్వవిద్యాలయం హిందీ విభాగం విద్యార్థి ఉజ్వల్ గోయల్‌ని ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి శుక్రవారం తన కార్యాలయంలో అభినందించారు. హిందుస్థానీ ప్రచార సభ(ముంబయి) ఆధ్వర్యంలో హిందీయేతర భాషా రాష్ట్రాల విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీలలో పాల్గొని ఏయూ విద్యార్థి ఉజ్వల్ గోయల్ తృతీయ స్థానంలో నిలిచి రూ.20 వేల నగదు బహుమతి అందుకున్నాడు. ఈ సందర్భంగా విద్యార్థిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఓఎస్‌డీ ఆచార్య వి.కృష్ణమోహన్, హిందీ విభాగ ఆచార్యులు జె.విజయభారతి, నాగర్‌మల్ అగర్వాల్, తదితరులు పాల్గొన్నారు.

వెయిట్ లిఫ్టింగ్‌లో క్రీడాకారుల సత్తా



క్రీడాకారులను అభినందిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం విద్యార్థులు వెయిట్ లిఫ్టింగ్ విభాగంలో పతకాలు సాధించిన పల్లవి, శ్రీ లక్ష్మిలను ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి తన కార్యాలయంలో అభినందించారు. ఆల్ ఇండియా ఇంటర్ జోనల్ యూనివర్సిటీ వెయిట్ లిఫ్టింగ్‌లో 64 కిలోల విభాగంలో ఎస్.పల్లవి, ఆల్ ఇండియా యూనివర్సిటీ క్రీడల్లో 81 కిలోల విభాగంలో సిహెచ్.శ్రీలక్ష్మి బంగారు పతకాలు సాధించారు. ఈ సందర్భంగా వారిని వీసీ సత్కరించి, అభినందించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్, క్రీడా విభాగాధిపతి ఆచార్య పల్లవి, క్రీడా విభాగ సంచాలకులు ఆచార్య ఎన్.విజయ్‌మోహన్, కోచ్ సిహెచ్.రాము, డాక్టర్ ఎల్‌బీ కళాశాల వ్యాయామ విద్య విభాగాధిపతి డాక్టర్ వై.శ్రీనివాసరావు, డాక్టర్ వి.ఎస్.కృష్ణా డిగ్రీ, పీజీ కళాశాల వ్యాయామ విద్యా విభాగాధిపతి డాక్టర్ ఎస్.సంధ్యారాణి, పాల్గొన్నారు.

సిబ్‌లో మౌలిక వసతుల కల్పన



విద్యార్థులతో ప్రారంభింపజేస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ బిజినెస్(సిబ్)లో ఏర్పాటు చేసిన కొత్త వసతులను విద్యార్థులతో కలిసి ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి శుక్రవారం ప్రారంభించారు. విద్యార్థులకు ఉపయుక్తంగా ఆర్‌వో వాటర్ ప్లాంట్, డిజిటల్ లైబ్రరీ, మూడు షటిల్ బ్యాడ్మింటన్ కోర్టులను ఏర్పాటు చేశారు. డిజిటల్ లైబ్రరీకి అవసరమైన కంప్యూటర్లను ఏయూ పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ ఇ.శంకరరావు బహూకరించారు. విద్యార్థులు విభాగంలోని వసతులను సద్వినియోగం చేసుకుంటూ ఉన్నతంగా రాణించాలని వీసీ సూచించారు. ఈ కార్యక్రమంలో సిబ్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ సారాబంది, క్రీడా విభాగాధిపతి ఆచార్య ఎ.పల్లవి, క్రీడా సంచాలకుడు ఆచార్య ఎన్.విజయ్‌మోహన్, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రక్రియలో అప్రమత్తంగా ఉండాలి





తూర్పు అసెంబ్లీ నియోజకవర్గం ఎన్నికల బాధ్యులతో మాట్లాడుతున్న జేసీ కలెక్టర్ కె.మయూర్ అశోక్

మహారాణిపేట: ఎన్నికల నిర్వహణ ప్రక్రియలో అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు విధులు నిర్వర్తించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ పేర్కొన్నారు. మోడల్ కోడ్ ఆఫ్ కాండాక్టు, ఇతర అంశాలపై సూర్యాబాగ్‌లోని జోన్–4 కార్యాలయంలో తూర్పు నియోజకవర్గ బాధ్యులకు శుక్రవారం ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. తూర్పు నియోజవర్గ పరిధిలో పని చేసే ఎంసీసీ(మోడల్ కోడ్ ఆఫ్ కాండాక్టు), ఎఫ్ఎస్‌టీ(ఫ్లయింగ్ స్క్వాడ్ టీం), ఎస్ఎస్‌టీ(స్టాటిక్ సర్వేయలెన్స్ టీం), వీఎస్టీ(వీడియో సర్వేయలెన్స్ టీం), వీవీటీ(వీడియో వ్యూయింగ్ టీం) అధికార బృందాల సభ్యులు సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా జేసీ మాట్లాడుతూ అధికారులంతా ఎన్నికల నియమావళిని కచ్చితంగా పాటించాలని, బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సూచించారు. ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తించినా, నగదు తరలించినా, తాయిలాలు పంచినా గుర్తించి తగిన చర్యలు చేపట్టేందుకు అధికారులు కృషి చేయాలని సూచించారు. ప్రతి రోజూ జరిగే సంఘటలకు సంబంధించి నివేదికలు ఇవ్వాలన్నారు. అవసరమైన చోట్ల చెక్ పోస్టులు పెట్టాలని, తరచూ తనిఖీలు నిర్వహించాలని చెప్పారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు కృషి చేయాలని ఈ సందర్భంగా జేసీ సూచించారు. ఈ సదస్సులో రెవెన్యూ, పోలీసు, జీవీఎంసీ, ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

‘రంగా హత్య కేసులో వెలగపూడి ఏ-1’



మాట్లాడుతున్న ముకుంద

సీతంపేట: వంగవీటి రంగా హత్యకేసులో వెలగపూడి ఏ–1 నిందితుడని, లిక్కర్ సిండికేట్ రారాజు వెలగపూడి రామకృష్ణబాబు తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యేగా డమ్మీ అయిపోయారని ప్రజా ప్రస్థానం పార్టీ అధ్యక్షుడు ముకుంద ఘాటైన విమర్శలు చేశారు. ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో శుక్రవారం నిర్వహించిన ప్రజా ప్రస్థానం పార్టీ వ్యవస్థాపక దినోత్సవంలో ఆయన మాట్లాడారు. రంగా హత్య కేసు నిందితుడు వెలగపూడి విజయవాడ నుంచి పారిపోయి విశాఖ వచ్చారన్నారు. వ్యాపారం ముసుగులో ప్రజల ఓట్లు కొనుగోలు చేసి మూడు సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారని ఆరోపించారు. ఇప్పటి వరకు ఆయన అసెంబ్లీలో మాట్లాడటం చూడలేదని ఎద్దేవా చేశారు. తూర్పు నియోజకవర్గంలో 15 ఏళ్లుగా ప్రజలకు సేవలందిస్తూ 2021లో పేదల సంక్షేమం కోసం ప్రజా ప్రస్థానం పార్టీ స్థాపించానని ముకుంద తెలిపారు. తమ పార్టీ తరఫున తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్నట్లు ప్రకటించారు.

సాయిబాబా ఆలయ వార్షికోత్సవం రేపు



ఆరిలోవ: జీవీఎంసీ 9వ వార్డు విశాలాక్షినగర్ కూడలి వద్ద సద్గురు సాయిబాబా ఆలయ 20వ వార్షికోత్సవం ఆదివారం జరగనుంది. ఈ మేరకు ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయాన్ని ఇప్పటికే అలంకరించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఆదివారం ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం వరకు పూజలు జరుగుతాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులకు మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించనున్నామన్నారు.

15వ వార్డులో ఇళ్ల పట్టాల పంపిణీ



లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య

మద్దిలపాలెం : జీవీఎంసీ 15వ వార్డు హెచ్‌బీ కాలనీలో లబ్ధిదారులకు శుక్రవారం జగనన్న ఇళ్ల పట్టాలను కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ త్వరలో జరగనున్న ఎన్నికల్లో సంక్షేమ పథకాల సారథి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా ఎన్నుకోవాల్సిన అవసరం ఉందన్నారు. వైఎస్సార్‌సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. అనంతరం వలంటీర్లకు సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ వార్డు అధ్యక్షుడు పీలా వెంకట్, నరాల సత్తిబాబు, వెంకటలక్ష్మి, బుగత ఏసురత్నం, మరియమ్మ, గొలగాని సురేష్, శ్రీనివాసరెడ్డి, నారాయణరావు, తదితరులు పాల్గొన్నారు.

సాక్షి

మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
వైజాగ్ ఈస్ట్
✆ 7331119904, 9912440606

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

వైజాగ్ ఈస్ట్
✆ 9912220751
Office mail : sakshiadvtvsp@gmail.com